

కల్వర్టు మరమ్మతు చేపట్టరూ..

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో అతి మారుమూల ప్రాంతం మైన లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధి దొరగుడా గ్రామ సమీపంలో కల్వర్టు మరమ్మతుకు నోచుకోక పోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత ఏడాది భారీ వర్షాలకు కల్వర్టు గొట్టాలు బయటకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానిక సర్పంచ్ త్రినాధ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ నిధులను కేటాయించి కల్వర్టు మరమ్మతు చేపట్టాలని ఆయన కోరారు.



దెబ్బతిన్న కల్వర్టు గొట్టాలు

డ్రెయినేజీలపై గిరిజనేతరుల అక్రమ కట్టడాలు

-పట్టించుకోని పంచాయతీ అధికారులు



డ్రెయినేజీ కాలువపై గిరిజనేతరుడు నిర్మించిన ఇల్లు

ప్రజాశక్తి:అరకులోయ రూరల్:మండల కేంద్రంలో విచ్చలవిడిగా గిరిజనేతరులు డ్రెయినేజిలపై అక్రమంగా ఇళ్లు, షాపులు, దుకాణాలు నిర్మించుకుని దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయం ఎదుట, మయూరి సిల్క్ హౌస్, కొండ వీధి, స్టేట్ బ్యాంక్ వెళ్ళే రోడ్డుకు ఇరువైపుల డ్రెనేజీలపై గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాదచారులు, వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంచాయతీ అధికారులు, స్థానిక సర్పంచ్‌కు గతంలో గిరిజన సంఘం, ప్రజా సంఘాలు, సీపీఎం నాయకులు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకున్న పరిస్థితి లేదు. డ్రెనేజీలపై షాపులు, దుకాణాల మెట్లు, ఇళ్ళులు కూల్చుతామని పంచాయతీ అధికారులు ప్రకటనలు చేస్తున్నారు తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవు. పంచాయితీ అధికారులు నోటీసులకే పరిమితం అవుతున్నారు. ఓ గిరిజనుడు తాత్కాలితంగా చిన్న రేకు షెడ్డు వేసుకుంటే కూల్చేసే అధికారులు గిరిజనేతరులకు మాత్రం అనుమతులు ఇచ్చి వారికే కొమ్ము కాస్తున్నారు.

ఖాళీ ప్రదేశాలను కొందరు గిరిజనేతరులు ఆక్రమణ చేసి కట్టడాలు నిర్మించుకుంటున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. డ్రెనేజ్ పై ఆక్రమణ చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో మురుగు నీటి కాలువలో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లు తుందని స్థానికులు మండిపడుతున్నారు. పంచాయతీ అధికారుల అండదండాలతో గిరిజనేతరులు విచ్చల విడిగా బినామీ పేర్లతో కట్టడాలు చేపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై తక్షణం చర్యలు తీసుకొని, తొలగించాలని గిరిజన ప్రజా సంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



గిరిజన సంఘం ఆఫీసు పక్కన డ్రెయినేజీ కాలువపై నిర్మాణం

పొగమంచుతో పరేషాన్!



చింతపల్లిలో విపరీతంగా కురుస్తున్న పొగమంచు

ప్రజాశక్తి -సీలేరు: చింతపల్లిలో రెండు రోజులుగా దట్టంగా కురుస్తున్న పొగమంచుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. శని, ఆదివారాల్లో ఉదయం 8 గంటల వరకు చింతపల్లి మార్కెట్, బస్‌స్టాండ్ తదితరప్రదేశాల్లో దగ్గరలో ఉన్న వస్తువులు, వ్యక్తులు సైతం కానరానంత దట్టంగా మంచు కురిసింది. ప్రస్తుతం ఎండాకాలం వచ్చినప్పటికీ పొగమంచు విపరీతంగా కురవడం, పండుగకు ముందు, శీతాకాలంలోనే ఉన్న పరిస్థితులు ఇపుడు నెలకొనడంపై పలువురు విస్మయం చెందుతున్నారు. ఒకవైపు మైదాన ప్రాంతంలోనే ఉష్ణోగ్రతలు పెరుగుతుంటే, ఇక్కడ చింతపల్లిలో మాత్రం పొగమంచు, రాత్రి వేళల్లో చలి వేసేం తగా చల్లని వాతావరణంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. సీలేరు, దారకొండ, సప్పర్ల తదితర ప్రదేశాల్లో మంచు తీవ్రత పూర్తిగా తగ్గుముఖం పట్టగా, ఇపుడు. చింతపల్లిలో మాత్రం సంక్రాంతికి ముందు తరహా మంచు కురుస్తోంది. దీంతో సూర్యుడు కనిపించే వరకు రోడ్లపైకి వచ్చేందుకు ప్రజలు అంతగా ఆసక్తి చూపడం లేదు. మరోవైపు ప్రకృతి ప్రేమికులు పొగమంచు అందాలను ఆస్వాదిస్తూ, సెల్‌ఫోన్లలో సెల్ఫీలు తీసుకుని సందడి చేశారు ఏటా జనవరి మాసాంతానికి తగ్గుముఖం పట్టిన పొగమంచు ఇపుడు ఫిబ్రవరి నెలాఖరు వచ్చినప్పటికీ విపరీతంగా కురుస్తుండడం విశేషం. కాగా విపరీతంగా కురుస్తున్న పొగమంచుతో జీడి,మామిడి పూతపై తీవ్ర ప్రభావం ఉండి నష్టం వాటిల్లుతుందని అంటున్నారు.

ఉగాదికి 1814 గృహాలు సిద్ధం

-1599 మందికి రూ.5. 59 కోట్ల రుణాలు - ప్రజాశక్తితో గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బాబు నాయక్

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లాలో ఈ ఏడాది ఉగాది నాటికి 1,814 గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ అల్లూరి జిల్లా ప్రాజెక్ట డైరెక్టర్ బాబు నాయక్ వెల్లడించారు. జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాల కార్యాచరణపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే....

జిల్లాలో మంజూరైన గృహాలు ఎన్ని

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం కింద జిల్లాలో 22



మండలాలలో లబ్ధిదారులకు 2021-22 సంవత్సరానికి 17,134 గృహాలు మంజూరు అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులు చేపట్టిన గృహ నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయి. ఇంకా కొన్నిచోట్ల లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టవలసి ఉంది.



ఇప్పటివరకు చేసిన చెల్లింపులు

ఒక్కొక్క గృహ నిర్మాణానికి లక్షా 80 వేల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. గృహ నిర్మాణ దశలను బట్టి రికార్డ్ చేసి లబ్ధిదారులకు నాలుగు విడతలగా చెల్లింపులు చేస్తున్నాం.

పాడేరు డివిజన్లో ఇళ్ల మంజూరు


పాడేరు మండలంలో 1,499, జి.మాడుగులలో 1,1 62, హుకుంపేటలో 582, ముంచంగిపొట్టు 536, పెదబయలులో 988, అరకులో 204, అనంతగిరిలో 1114, డుంబ్రిగూడలో 772, చింతపల్లిలో 2042, జీకే వీధిలో 2227, కొయ్యూరులో 1,891 గృహాలు మంజూరయ్యాయి.

రంపచోడవరం డివిజన్లో ఇళ్ల మంజూరు

చింతూరు మండలానికి 448, రంపచోడవరంకు 628, వై.రామవరం 698, ఎటపాక 422, దేవీపట్నం 162, రాజవొమ్మంగి 272, వి.రామచంద్రపురం 128, మారేడుమిల్లి 302, అడ్డతీగల 611, గంగవరం 328, కూనవరంకు 118 గృహాలు మంజూరయ్యాయి.

ఎఒబిలో పోలీసులు అప్రమత్తం

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో కూంబింగ్ ముమ్మరం



సరిహద్దుల్లో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు: ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లా జేగేరుకొండ అటవీప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య శనివారం ఎన్‌కౌంటర్, ఆదివారం మావోయిస్టులు మందుపాతర పేల్చిన ఘటనలు వరుసగా చోటుచేసుకోవడంతో ఆంధ్రాఒడిశా ప్రాంతంలో పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తమైంది, ప్రత్యేక బలగాలు కూంబింగ్ ముమ్మరం చేయడంతోపాటు సరిహద్దుల్లోని ఔట్ పోస్టుల్లో భారీగా నిఘా పెంచి ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపడుతున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు, మందుపాతర ఘటనలో ఒక పోలీసు మృతి చెందడంతోపాటు ఎదురుకాల్పుల ఘటనలో ఎనిమిది మంది మావోయిస్టులు హతమయ్యారని పోలీసులు ప్రకటించినప్పటికీ, వారి మృతదేహాలను మావోయిస్టులె మాయం చేశారని సమాచారం అందుతున్న నేపథ్యంలో ఎఒబిలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ ఎన్‌కౌంటర్‌తో ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో భారీసంఖ్యలో పోలీసు బలగాలను మోహరించి, గాలింపు చర్యలు తీవ్రతం చేయడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయం మన్యవాసులను వెంటాడుతోంది.

నేడు రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరం


ప్రజాశక్తి -చింతూరు : చింతూరు ఐటిడిఎ కార్యాలయం ప్రక్కనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచన మేరకు ఈ నెల 27న సోమవారం పాడేరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.రత్నమాణిక్యం, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త ఎన్. కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తాన్ని రంపచోడవరం, చింతూరు రెవిన్యూ డివిజన్‌లోని తలసీమియా వ్యాధిగ్రస్తులైన చిన్నారులకు వినియోగిస్తారన్నారు. ఆసక్తి గల దాతలు స్థానిక డిగ్రీ కళాశాలకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. శిబిరంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పి .పుల్లయ్య, స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండ్ డాక్టర్ ఎన్‌వి. కోటిరెడ్డి, ఐటిడిఎ ఇన్‌ఛార్జి ఎపిఒ కె.సుజాత పాల్గొంటారు. ఈ శిబిరాన్ని ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ సూరజ్ గనోరే ప్రారంభిస్తారన్నారు.



బకెట్లతో ఆవు పేడను మోస్తున్న విద్యార్థినులు

విద్యార్థినులతో వెట్టిచాకిరీ

ప్రజాశక్తి - ముంచింగిపుట్టు:మండలంలో జోలాపుట్టు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థినులతో వెట్టిచాకిరీ చేయించిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. పాఠశాల పరిసరాల ప్రాంతాలలో ఆరు బయట ఆవులు విసర్జించిన పేడను విద్యార్థులు సేకరించి బకెట్లలో తలపై మోసుకొని వెళు ్ళతూ ఈ బరువుకు ఇబ్బంది పడ్డారు. హాస్టల్ పరిశుభ్రతకు విద్యార్థులను వాడుకోవడం సరికాదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు1 పాఠశాలలో పిక్నిక్ నిర్వహించిన అనంతరం టెంట్ హౌస్ సామాగ్రి, కుర్చీలను విద్యార్థులతో మోయిపించడం అప్పట్లో చర్చనీయాశంమైంది.ఈ విషయం మండల అధికారులకు సోషల్ మీడియా ద్వారా తెలిసినప్పటికీ కనీసం చలనం లేకుండా వ్యవహరించడం గమనార్థం.



బెల్లాన్ని పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి మత్స్యలింగం

బెల్లానికి మార్కెట్ సౌకర్యం కల్పనకు కృషి

ప్రజాశక్తి-హుకుంపేట:ఏజెన్సీ ప్రాంతాల్లో తయారవుతున్న నాణ్యమైన బెల్లాన్ని మార్కెట్లో అనుమతించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతానని జెడ్పిటిసి రేగం మత్స్య లింగం అన్నారు. మండలంలోని దుర్గం, మత్స్యపురం పంచాయతీ నిట్టపుట్టు, ఉప్ప, తదితర ప్రాంతాల్లో గిరిజనులు పండిస్తున్న బెల్లంను జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం ఆదివారం పరిశీలించారు. బెల్లంకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తెలియ చేస్తానని తెలిపారు. తాము ఎంతో శ్రమించి కష్టపడుతున్నా గిట్టుబాటు ధర రాలేదని రైతులు అన్నారు. అనంతరం జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కల్తీ బెల్లాన్ని కొనుగోలు చేయకుండా రైతుల దగ్గర కొనుగోలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, దుర్గం మాజీ ఎంపీటీసీ ఒరబొయిన బాలన్న, ఒల్డ పంచాయతీ ఉప సర్పంచ్ అప్పలస్వామి, నారాయణ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్‌లో సమస్యల తిష్ట!

- దారి, తెన్నూ లేని దుస్థితి
- నీటి అవసరాలకు విద్యార్థుల నానా అగచాట్లు
- సొంత నిధులతో సెప్టిక్ ట్యాంకులు క్లీన్ చేయించిన వార్డెన్ తాతాజీ
- బాలికల కష్టాలను పట్టించుకోని అధికారులు



శిథిల భవనంలా ఉన్న చింతూరు సాంఘిక సంక్షేమ హాస్టల్

ప్రజాశక్తి -చింతూరు: చింతూరు రెవిన్యూ డివిజన్ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోనే హాస్టల్‌ఉంది. పాఠశాలకు ప్రహరీ ఉండడం, ప్రధాన గేటుకు తాళం వేయడంతో హాస్టల్ నుండి విద్యార్థులు సిబ్బంది బయటకు వెళ్లాలంటే ఇబ్బందులే. పాఠశాల పనివేళల్లోనే గేటు తెరిచి ఉంటుంది. మిగతా సమయాల్లో గేటుకు తాళం వేయడంతో విద్యార్థులు కానీ హాస్టల్ సిబ్బంది కానీ బయటకు వెళ్లి కావలసిన వస్తువులు తెచ్చుకోవాలంటే ఇబ్బందులే. హాస్టల్ విద్యార్థులు ఎటువంటి అవసరమున్నా దారి లేని దుస్థితి. పాఠశాల సమయం ముగియగానే గేటుకు తాళం వేయడంతో, మరుసటి రోజు ఉదయం వరకు హాస్టల్ విద్యార్థులు, సిబ్బంది పాఠశాల ఆవరణలోనే బందీలుగా ఉండాల్సిందే. విద్యార్థులు సిబ్బందికి అత్యవసర పరిస్థితి ఏర్పడితే గోడలు దాటి వెళ్లాల్సి వస్తోంది. హాస్టల్‌కు వేరేగా రహదారి ఏర్పాటు చేయాలని అనేకసార్లు అధికారులకు విన్నపించినా పట్టించుకోలేదు.

హాస్టల్లో సెప్టిక్ ట్యాంకులు నిండిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో, వార్డెన్ తాతాజీ తన సొంత డబ్బులు రూ.15వేలు వెచ్చించి రెండు సెప్టిక్ ట్యాంకులను క్లీన్ చేయించారు. ఉన్న ఒక్కబోరు నుంచి సరిగా నీరు రాకపోవడంతో హాస్టల్‌లో వంటకు విద్యార్థులకు తాగునీరు, స్నానాలు, మరుగు అవసరాలను నానా అవస్థలు పడుతున్నారు.

వార్డెన్ చొరవతో హాస్టల్ ఆవరణలోనే కూరగాయల పాదులు వేసి, పండిన వాటిని హాస్టల్ వంటల్లో వినియోగిస్తున్నారు. పాడుబడిన పాత హాస్టల్ రేకుల షెడ్డులోనే వార్డెన్ తన కుటుంబంతో ఉంటూ విద్యార్థులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకుంటున్నానని విద్యార్థులు అంటున్నారు. హాస్టల్‌లో సురక్షిత తాగునీటి కోసం ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, హాస్టల్‌కు వేరేగా రహదారి సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చొరవ చూపి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



హాస్టల్ ఆవరణలో పండిస్తున్న పెరటితోట కూరగాయలు

నాలుగు రోజులుగా నీరు లేకున్నా పట్టించుకోరేం?

- బాలికల హాస్టల్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు
- గిరిజన సంఘం నేతల బృందం

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మారేడుమిల్లి బాలికల హాస్టల్‌లో నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి డిమాండ్ చేశారు. గిరిజన సంఘం మండల ఇన్‌ఛార్జి మట్ల వాణిశ్రీ ఆధ్వర్యంలో జిల్లా నేతల బృందం ఆదివారం మారేడుమిల్లి గర్ల్స్ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా నేత మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులు నాలుగు రోజులుగానీరు లేక అవస్థలు పడుతుంటే అధికారులెవరూ పట్టించు కోకపోవడం దారుణమన్నారు. గిరిజన విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం ఐటిడిఎ అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. విద్యార్థులకు కాస్మోటిక్స్, శానిటేషన్ కిట్స్‌కు మంగళం పాడేసి, తల్లి పేరున ఇస్తున్న అమ్మఒడిలో అంతా కలిపేశామని చేతులు దులుపుకోవడం అత్యంత దారుణమన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, జిల్లా నాయకులు సాదల విద్యా సాగర్ రెడ్డి, మారేడుమిల్లి మండల కమిటీ సభ్యులు వీకా రాజన్న దొర పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత

వైసిపి పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం

మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి

ప్రజశక్తి- రాజవొమ్మంగి: వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే, రంపచోడవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి అన్నారు, ఆదివారం రాజవొమ్మంగి వచ్చిన సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వైసిపి అధికారంలోకి వచ్చిన దాదాపు నాలుగేళ్లు పూర్తవుతున్నా కనీస అభివృద్ధి కానరాదన్నారు. మూడు రాజధానుల పేరుతో ఇన్నాళ్లుగా కాలం గడిపేశారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఎవరైనా ప్రశ్నిస్తే వైసిపి ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు.

ఎన్ని కేసులు పెట్టినా వెనక్కు తగ్గేది లేదని, వైసిపి వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామన్నారు. ప్రభుత్వ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో,టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, సీనియర్ నాయకులు దంతులూరి శివ రామచంద్రరాజు, సర్పంచ్ గొల్లపూడి రమణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలంటూ ఉమ్మడి విశాఖ జిల్లాలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఆదివారం రమాప్రభ మద్దతుదారులు వాడవాడలా తిరిగి ఉత్తరాంధ్ర సమస్యలపై గళమెత్తేందుకు రమాప్రభకు అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు.

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు సహా ఆర్‌కె.బీచ్‌లో కోరెడ్ల రమాప్రభ ప్రచారం విస్తృతంగా సాగింది. బీచ్ రోడ్డులోని వైఎంసిఎ నుంచి సబ్‌మెరైన్ వరకూ నిర్వహించిన ప్రచారంలో రమాప్రభ పాల్గొన్నారు. పిడిఎఫ్ తరుపున పోటీచేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని మనవి చేశారు. తాను రాజకీయపార్టీలకు అతీతంగా 250కు పైగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజా సంఘాల మద్దతుతో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. శాసన మండలిలో ఉత్తరాంధ్ర గొంతు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు పిడిఎఫ్ అభ్యర్థిని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకుని ఓటర్లను గందరగోళ పరిచేందుకు ఇంకో రమాప్రభను పోటీలో పెట్టి ఓట్లు చీల్చడానికి పెద్దకుట్ర పన్నాయన్నారు. ఆ విషయాన్ని పట్టభద్ర ఓటర్లు గ్రహించి అధికార, ప్రతిపక్ష పార్టీలకు తగిన బుద్ధిచెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార క్యాంపెయిన్‌లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సీనియర్ నాయకులు జివిఎస్.రాజేశ్వరరావు, వార్వా నాయకులు ఎం.శివనాగేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు సత్యన్నారాయణ, ఐద్వా జోన్ కార్యదర్శి కె.కుమారి, ప్రజానాట్య మండలి నాయకులు దండు నాగేశ్వరరావు, ఎం.చంటి, పి.వెంకటరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ రాంనగర్ ప్రాంతంలో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు, ఇతర ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. కె.నరసింగరావు, ఎం.సూరీడు, ఎం.సుబ్బారావు, అప్పలరాజు, రామారావు పాల్గొన్నారు.

మాధవధార : పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఆదివారం తెన్నేటినగర్ ప్రాంతంలో వివిధ సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూన వెంకటరావు, పి.రామారావు, ఎస్ శ్రావణ్ కుమార్, బి.పాపారావు, ఎస్.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని తాళ్లవలసలో సిఐటియు నాయకులు ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటును వేసి కోరెడ్ల రమాప్రభను ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరుతూ పట్టభద్రులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు

పెందుర్తి : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ఎస్ఆర్.పురం, జుత్తాడ గ్రామాల్లో ప్రజా సంఘ నాయకులు ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ప్రచారంలో సిఐటియు నాయకులు బి.జగన్, శంకరరావు, డి.వెంకటరమణ, మహిళ సంఘం నాయకులు బి.రమణి పాల్గొన్నారు.

పాడేరు : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు తమ సంఘం తరపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ అల్లూరి సీతారామరాజు జిల్లా కన్వీనర్ శెట్టి నాగరాజు తెలిపారు. ఆదివారం పాడేరు కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రమాప్రభను ఎమ్మెల్సీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్నారని తెలిపారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ వంటి సమస్యలు పరిష్కారం కావాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీల కృషి ఎంతో ఉందని తెలిపారు. మనం చేస్తున్న ఉద్యమాలకు చేదోడు వాదోడుగా ఉంటూ మన సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, గత తెలుగుదేశం ప్రస్తుతం వైసీపీ, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత లేకుండా చేస్తున్నాయన్నారు. పని ఒత్తిడి పెంచుతూ కనీస వేతనాలు అమలు చేయలేదని తెలిపారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జిసిసి, మెడికల్ అండ్ హెల్త్, గిరిజన గురుకులాలు, ట్రైబల్ వెల్ఫేర్, ఐటిడిఏ, టూరిజం ఇతర ప్రభుత్వ శాఖల్లో వందలాది మంది కార్మికులు ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు.పని ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వాలు గొడ్డు చాకిరి చేయించు కుంటున్నాయన్నారు.భవిష్యత్తులో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కే.లక్ష్మణరావు, మహేష్ పాత్రుడు, నాగరాజు, వీరన్న పడాల్, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

డుంబ్రిగూడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలోని పట్టభద్రులకు కరపత్రాలను పంచారు. ప్రజా సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థులకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతుసంఘాల నేతల విస్తృత ప్రచారం

కె.కోటపాడు : ప్రజల సమస్యలపై ప్రశ్నించే వ్యక్తిని శాసనమండలికి పంపిద్దామని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినిబాబు, ప్రజాసంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు కోరారు. ఆదివారం మండలంలోని గాలివలస గ్రామంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ విస్తృతం ప్రచారం చేశారు ప్రజా సమస్యలపై కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్న అనుభవం రమాప్రభ సొంతమని, ఉత్తరాంధ్ర జిల్లాల్లో 250 ప్రజాసంఘాలు బలపరుస్తున్న ఆమెను గెలిపించడం అవసరమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వనమ సూర్యనారాయణ పాల్గొన్నారు.

చోడవరం : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరుతూ ఎల్ఐసి ఐసియు, డివైఎఫ్ఐ, కెవిపిఎస్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్ఐసి నాయకులు లవరాజు, అప్పారావు, శ్రీను, కల్యాణ్, గణేష్ డివైఎఫ్ఐ నాయకులు నాయుడు, గణేష్, కెవిపిఎస్ నాయకులు చందర్రావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నిస్తా



మాట్లాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి -అనకాపల్లి : ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక, రైతు మహిళా ప్రజా సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో ప్రశ్నిస్తామని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. సమస్యలపై ప్రశ్నించే గొంతు వినిపించాలంటే రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉద్యోగ పట్టభద్రులను కోరారు. సమావేశంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.అజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు ఎం. నాగభూషణం, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, మళ్ల స్వామి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.


పాడేరులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు


తెన్నేటినగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వెంకటరావు తదితరులు


పెందుర్తి ప్రాంతంలో ప్రచారం చేస్తున్న జగన్, రమణి తదితరులు


చోడవరంలో ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు


తాళ్లవలసలో సిఐటియు నాయకుల ప్రచారం

స్నేక్ సేవర్ వెబ్ సైట్ ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : స్నేక్ సేవర్ సొసైటీ వెబ్‌సైట్‌ను మింది గ్రామంలోని మంత్రి నివాసంలో గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. స్నేక్ సేవర్ సొసైటీని స్థాపించి వన్యప్రాణుల సంరక్షణ, విష సర్పాల నుంచి ప్రజల్ని రక్షించడం కోసం రొక్కం కిరణ్‌కుమార్ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఇళ్లల్లోకి, పరిశ్రమల్లోకి చొరబడే సర్పాల నుంచి అక్కడి వారిని కాపాడుతూ పట్టుబడిన సర్పాలను కొండప్రాంతాల్లో విడిచిపెట్టడం సాహసోపేత చర్య అని పేర్కొన్నారు. ఆపద అని తెలిసిన మరుక్షణమే సొసైటీ సభ్యులు అక్కడికి వెళ్లి ఎలాంటి సర్పాన్నైనా ధైర్యంగా పట్టుకొని ప్రజల్లో గుండె ధైర్యాన్ని నింపుతున్నారని కొనియాడారు. ఇలాంటి సాహసోపేత పనులు చేపట్టే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా www.snakesaverkiran.com పేరిట వెబ్ సైట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 68వ వార్డు వైసిపి నాయకుడు గుడివాడ లతీష్, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దని ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ : కేంద్రకారాగారం ఎదురుగా గల రామకృష్ణాపురంలో ప్రభుత్వ మద్యం దుకాణం వద్దని స్థానికులు ఆందోళనకు దిగారు. 13వ వార్డు పరిధి రామకృష్ణాపురం కాలనీలో నివాసాల మధ్య ప్రభుత్వం మద్యం దుకాణం ఏర్పాటుకు ఏర్పాట్లు చేసింది. మద్యం షాపు ఏర్పాటు చేయబోయే షెడ్డు ముందు గ్రామస్తులందరూ ఏకమై ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మద్యం షాపునకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. నగర శివారు ప్రాంతం కావడంతో ఇప్పటికే గంజాయి బ్యాచ్‌లతో ఇబ్బందులు పడుతున్నామని, దీనికి తోడు మద్యం షాపు ఏర్పాటు చేస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ కాలనీలో అందరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఇక్కడ మద్యం షాపు ఏర్పాటు చేస్తే తమ బ్రతుకులు మరింత నాశన మవుతాయని మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మద్యం షాపు ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని కోరారు. లేకుంటే నిరవధిక పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో స్థానిక సంఘం నాయకులు వంకర బాబూరావు, కాకర గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మైక్రోవాసుక్యులర్ వర్క్‌షాప్

ప్రజాశక్తి -మధురవాడ : గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ విభాగం ఆధ్వర్యాన రెండురోజులుగా సూక్ష్మ రక్త నాళాల చికిత్స విధానాలపై దంత వైద్యులకు నిర్వహించిన వర్క్ షాప్ ఆదివారం ముగిసింది. చెన్నైలోని సవితా దంతవైద్య కళాశాల రీకనస్ట్రక్టివ్ సర్జరీ, అంకాలజీ విభాగం అధిపతి డాక్టర్ సెంథిల్ మురుగన్ ఆధ్వర్యాన దంత వైద్యులకు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. కింది దవడ దెబ్బతిని రోగికి కాలి ఎముక నుంచి తీసిన భాగాలతో దవడను తిరిగి పునర్మించే అరుదైన చికిత్సను గీతం వైద్యకళాశాల ఆపరేషన్ థియేటర్ నుంచి తెరపై వైద్యులకు ప్రత్యక్షంగా గమనించే ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దంత వైద్యులు హజరైన ఈ వర్క్ షాప్ ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గీతం దంతకళాశాల, ఆసుపత్రి ప్రిన్సిపల్ డాక్టర్ డి.సీతారామరాజు, ఓరల్ సర్జరీ విభాగాధిపతి, ఫ్యాకల్టీ సభ్యుడు డాక్టర్ ఎన్‌వివి.సత్యభూషణ్ హజరై డాక్టర్ సెంథిల్ మురుగన్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో సిద్ధేంద్రయోగి నాట్యాలయం ఆధ్వర్యాన శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాధ నమామ్యహం, బ్రహ్మాంజలి, ఝూనుత, శబ్దం, భావములోన బాహ్యమునందున, రాజం కొండ మీద, ఘల్లు ఘల్లు, దానగూడ లంబాడి పిల్లా, మొక్క జొన్న తోటలో, నోమి నోమన్నలారా, తదితర అంశాలను ప్రదర్శించారు. పల్లవి, రాఘవ, ఈశ, స్రవంతి, వేదిత, యశస్విని, కణిత, మోక్ష, భాషిత కళాకారులు నృత్యాలను ప్రదర్శించి సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

సాగర్‌నగర్ బీచ్‌లో క్లీనింగ్

ప్రజాశక్తి -మధురవాడ : జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యాన నగరంలోని సముద్ర తీర ప్రాంతాలను పరిశుభ్రం చేసే కార్యక్రమంలో భాగంగా సాగర్ నగర్ బీచ్‌లో క్లీనింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 10వ విడత బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని సాగర్‌నగర్ వద్ద నిర్వహిస్తున్నామని, ఇప్పటికే విశాఖలో 9 విడతలుగా బీచ్ క్లీనింగ్ కార్యక్రమాలను కొనసాగించామని చెప్పారు.


మాట్లాడుతున్న 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ఉక్కు దీక్షల్లో కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి పోరాటాలను మరింత ఉధృతం చేసి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచుతామని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 745వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి గంగారావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలిగే సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరమైతే ముందుగా నష్టపోయేది కాంట్రాక్టు కార్మికులేనని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణతో పాటు పలు విభాగాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ఉజ్వలారాణికి డాక్టరేట్

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన గిరిజనోపాధ్యాయులు సీదరి సన్యాసిరావు, సుజనారత్నం దంపతుల కుమార్తె సీదరి ఉజ్వలా రాణికి అగ్రికల్చర్‌లో పిహెచ్‌డి దక్కడంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈనెల 24న న్యూఢిల్లీలో ఐఎఆర్ఎలో నిర్వహించిన 61వ కాన్వకేషన్‌లో ఐకార్ డైరెక్టర్ జనరల్ నుంచి పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. గతంలోనూ ఐఎఆర్ఆర్ 53వ కాన్వకేషన్‌లో ఎంఎస్‌సి (అగ్రికల్చర్) డిగ్రీ అందుకున్నారు. ఐకార్ జెఆర్ఎఫ్ అందించిన ఫెలోషిప్ ద్వారా పిహెచ్‌డి పూర్తి చేసి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఏజెన్సీలోని మూరుమూల ప్రాంతానికి చెందిన ఉజ్వలాకుమారి, దేశరాజధానిలోని ఉన్నత విద్యాసంస్థల్లో విద్యాభ్యాసం చేస్తూ, అక్కడే 2017 నుంచి ఆంగ్రావులో అగ్రికల్చర్ ఎకనామిక్స్ విభాగంలో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. తనకు వైద్యవిద్యను అభ్యసించాలని, పేదలకు, దేశానికి సేవ చేయాలని చిన్నతనం నుంచి ఎంతో తపన ఉండేదన్నారు. అయితే మెడిసిన్‌లో సీట్ దక్కకపోడంతో అగ్రికల్చర్ బిఎస్‌సి, తర్వాత ఎంఎస్‌సి, ఇపుడు పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. వైద్యురాలిగా డాక్టర్ అవ్వాలని అనుకున్న తాను అగ్రికల్చర్‌లో డాక్టరేట్ పొందానని ఆవేదనతో తెలిపింది. నిరంతర కృషి, పట్టుదలతో అగ్రికల్చర్ ఎకనామిక్స్‌లో అత్యున్నత డిగ్రీ సాధించడంపై పలువురు అభినందిస్తున్నారు.

చిరు ధాన్యాలు ఆరోగ్యకరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ : చిరు ధాన్యాలు ఆరోగ్యకరమని మిల్లెట్స్ రాంబాబు అన్నారు. ఆదివారం ఉదయం గురుద్వారా దగ్గరలో ఉన్న ఓ ప్రైవేటు వసతి గృహంలో గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. చిరుధాన్యాలను నానబెట్టి వండుకోవాలన్నారు. చిరుధాన్యాలు వండినప్పుడు వచ్చే గంజి తర్వాత రోజు తీసుకోవడం చాలా ఆరోగ్యకమైనదని వివరించారు.

సిపి కార్యాలయం అదనపు అంతస్తు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దివీస్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని అదనపు అంతస్తును నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, దివీస్ సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) మధుసూదనరావుతో కలిసి ఆదివారం ప్రాంభించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ నగర పోలీసుల తరపున దివీస్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : సమన్వయంతో పనిచేసి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను విజయవంతం చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ - 2023 ఏర్పాట్లు, అధికారులు చేపట్టాల్సిన పనులపై పరిశ్రమల శాఖ కమిషనర్ డాక్టర్ జి.సృజన, జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, జివిఎంసి కమిషనర్ రాజాబాబులతో కలిసి కలెక్టర్ మల్లికార్జున సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని మార్చి 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు నియమించిన నోడల్ అధికారులందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు రానున్నట్లు పేర్కొన్నారు. ముఖేష్ అంబానీ, నవీన్ మిట్టల్ వంటి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అంబాసిడర్లు, వ్యాపారవేత్తలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు కేటాయించిన విధులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. సదస్సుకు సంబంధించి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ప్రతినిధులు బస చేసే హోటళ్ల వద్ద సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అతిథులు బస చేసే హోటళ్ల వద్ద, విమానాశ్రయం వద్ద, ఎయు గ్రౌండ్‌లోనూ వైద్య ఆరోగ్య శాఖ నుంచి మెడికల్ టీంలు, అంబులెన్స్, మందులు అందుబాటులో ఉండాలన్నారు. ఎంజిఎంలో సాంస్కృతిక కార్యక్రమాలను టూరిజం అధికారులు చూసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్త పడాలని ఎపిఇపిడిఎల్ ఎస్ఇని ఆదేశించారు. పరిశ్రమల శాఖ కమిషనర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ సమ్మిట్‌కు వచ్చే పారిశ్రామికవేత్తలను విమానాశ్రయంలో రిసీవ్ చేసుకోవాలని, వారికి అవసరమైన వాహనాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఏర్పాట్లను వెన్యూవైజ్‌గా వివరించారు. ప్రారంభోత్సవంలో లేజర్ షో, మా తెలుగు తల్లికి మల్లెపూదండ పాట ఉంటాయన్నారు. సమ్మిట్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది అవసరమైన ఎంట్రీ పాస్‌లను తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సిహెచ్.రంగయ్య, పరిశ్రమల శాఖ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

సమ్మిట్ ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వలవన్, పరిశ్రమల శాఖ కమిషనర్ సృజన తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ 25 దేశాల నుంచి పారిశ్రామిక ప్రముఖులు హాజరవుతున్నారని, 7500 మంది ఇప్పటివరకు రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు.

ఉత్తరాంధ్ర సమస్యలపై గళమెత్తే..

కోరెడ్ల రమాప్రభను గెలిపించాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ, పాల్గొన్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ, కార్మిక నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం) : ఉత్తరాంధ్ర అభివృద్ధికి, ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణకు 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను శాసన మండలి ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కె.రమాప్రభ ఆదివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మిక సంఘాల నాయకులతో ముఖాముఖి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటు సమస్య పరిష్కారం కోసం ఏ ఒక్క పార్టీ నేడు కృషి చేయడం లేదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసిపి ప్రభుత్వం కక్ష కట్టిందని తెలిపారు. ఆరేళ్లుగా శాసన మండలిలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ మాధవ్ ఈ ప్రాంత అభివృద్ధిపై మాట్లాడింది ఏమీ లేదన్నారు. ఆయన ప్రతిపక్ష ఎమ్మెల్యే అయినప్పటికీ అధికార పక్షానికి వంత పాడుతూ కాలం గడిపారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో ఉత్తరాంధ్ర సమస్యలపై మండలిలో గళమెత్తి నిజాయితీగా పనిచేసే ప్రజా ప్రతినిధిని ఎన్నుకోవాల్సిన అవసరముందన్నారు. మూడు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల్లోని ఉద్యోగులంతా అందుకు గట్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై శాసన మండలిలో ప్రశ్నించే, నిలదీసే గొంతు ఉండాలంటే రమాప్రభను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ అమలు కోసం, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం కోసం, సిపిఎస్ రద్దు కోసం, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం, ప్రైవేట్ విద్యా సంస్థల ఉద్యోగుల, ఉపాధ్యాయులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు కోసం, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో స్టీల్ సిఐటియు నాయకులు జె.అయోధ్యరామ్, స్టీల్ ఎఐటియుసి నాయకులు జె.రామకృష్ణ, బిహెచ్ఇఎల్ యూనియన్ నాయకులు జిటిపి.ప్రకాష్ సహా ఎస్.ప్రసాద్ (షిప్ యార్డ్), పిఇసిహెచ్‌వి.సాగర్ (బిఎస్ఎన్ఎల్), పడాల రమణ (ఎఐటియుసి), లక్ష్మణరావు (విశాఖ పోర్టు), పిట్టా నారాయణమూర్తి (జింక్ ఎంప్లాయీస్ యూనియన్), బిబి.గణేష్ (ఎల్ఐసి), పలువురు హెచ్‌పిసిఎల్, డాక్‌యార్డ్ యూనియన్ల నాయకులు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి ఎస్.జ్యోతీశ్వరరావు పాలొన్నారు.


వారపు సంతలో సాగుతున్న పుచ్చకాయల అమ్మకాలు

పుచ్చకాయలకు డిమాండ్

ప్రజాశక్తి - సీలేరు : సీలేరు వారపు సంతలో పుచ్చకాయలకు భలే డిమాండ్ కనిపించింది, ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల్లో పండించిన రైతులు వీటిని వారపుసంతలో విక్రయించడానికి వాహనాల్లో తీసుకొచ్చారు. వీటిని కొనేందుకు సంతకు వచ్చే గిరిజనులు ఎగబడడం కనిపించింది. సీలేరు పరిసర ప్రాంతాల్లో పగటిపూట ఉష్ణోగ్రతల క్రమేణా పెరుగుతుండడంతో, దాహార్తి తీర్చడానికి, అలాగే శరీరంలో నీటిశాతం పెరగడానికి పుచ్చకాయలు తినడం వల్ల ప్రయోజనం ఉంటుందని అభిప్రాయం వ్యక్తమౌతున్న నేపథ్యంలో వారపుసంతకు తెచ్చిన వీటిని ప్రజలు భారీగానే కొనుగోలు చేశారు. సీజన్, డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి వరకు రూ.20లకే అమ్ముడుపోయిన పుచ్చకాయలను దాదాపు ఐదు రెట్లు రేటు పెంచి కాస్త పెద్ద సైజున్న వాటిని ఒక్కొక్కటి రూ.100 చెప్పినా భారీగానే అమ్ముడుపోవడం విశేషం.

అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కొయ్యూరు : బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, లేక వారికి అసభ్యకరమైన దృశ్యాలు చూపించినా, తాకరాని చోట తాకినా సెక్షన్ 67(బి) ఐటి యాక్ట్, పోక్సో చట్టం సెక్షన్ 14 ప్రకారం నిందితులపై కఠినచర్యలు తప్పవని కొయ్యూరు సిఐ ఎ.స్వామినాయుడు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని రావణాపల్లి గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సిఐ ఎ.స్వామినాయుడు మాట్లాడుతూ, విద్యార్థినులు సమాజంలో మంచి, చెడులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చెడుగా ప్రవర్తించే వ్యక్తులకు దూరంగా ఉండాలని, ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే తమకు ఎదురైన ఇబ్బందులను వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మృధుభాషిణి, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ఏజన్సీలోని మారుమూల గల ఓ గిరిజన విద్యార్థిని దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రముఖుల చేతుల మీదుగా పిహెచిపట్టా అందుకోవడంతో పలువురు విద్యార్థినిని అభినందనలతో ముంచెత్తుతున్నారు

పచ్చకామెర్లతో పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి -కొయ్యూరు : గొలుగొండ మండలం, సిహెచ్.నాగాపురం సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్న దవల లోవరాజు(26) శనివారం రాత్రి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. మండలంలోని చిట్టింపాడు గ్రామానికి చెందిన లోవరాజు గొలుగొండ మండలంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. గతవారం రోజులుగా పచ్చకామెర్లతో బాధపడుతున్న లోవరాజు నర్సీపట్నంలో చికిత్స అనంతరం కొద్దిగా నయమైనట్లు అనిపించడంతో మళ్లీ విధులకు హాజరై అవిశ్రాంతంగా పనిచేయడంతో మళ్లీ వ్యాధి తిరగబెట్టిందని సహోద్యోగులు అంటున్నారు. ఆరోగ్యం విషమించడంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించగా మృత్యువాత పడ్డారు. కాగా అవివాహితుడైన లోవరాజు అకాలమరణంతో ఆయన తల్లిదండ్రులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గాది శ్రీధర్ రెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా శిక్షణ పొందిన ప్రతి విద్యార్థీ ఉద్యోగంలో స్థిరపడాలని ప్రభుత్వ సలహాదారు గాది శ్రీధర్ రెడ్డి అన్నారు. శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన సందర్భంగా డిఆర్ఎం కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఓ హోటల్‌లో ఆదివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. విజయనగరం జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ వెంకట సుబ్బయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీధర్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారులుగా నియమించడం హర్షణీయమన్నారు. శ్రీదర్ రెడ్డి మాట్లాడుతూ స్టూడెంట్స్ ప్లేసెంట్స్ కోసం హెచ్‌ఆర్‌ల వివరాలు ప్రభుత్వానికి అందరూ అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎన్.సాంబశివరావు, ఒఆర్ఎం.రావు పాల్గొన్నారు.